క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్‌కు వినతి

నడిగూడెం : మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆదిమళ్ల సురేష్ ఆదివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాలకు అంతర్గత రహదారులు, సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, అభివృద్ధికి సహకరించాలని వినతిలో కోరినట్లు వెల్లడించారు.

ఎస్‌ఐ రవీందర్‌నాయక్‌కు నాయకుల సన్మానం



ఎస్‌ఐ రవీందర్‌నాయక్‌ను సన్మానిస్తున్న బంజారా సేవా సంఘం నాయకులు

నేరేడుచర్ల : మండల ఎస్‌ఐగా రవీందర్ నాయక్ బాధ్యతలు చేపట్టడంతో ఆదివారం ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ ఫొటోను బహూకరించారు. సన్మానించిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమావత్ నరినాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలునాయక్, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనునాయక్, హెమ్లానాయక్, కోటి నాయక్, శంకర్‌నాయక్, శివనాయక్, వాగ్యా నాయక్, సందీప్‌నాయక్, బి.నాగునాయక్, ఎం.నాగునాయక్ తదితరులున్నారు.

డ్రెయినేజీల్లో పూడిక తొలగించాలి

నడిగూడెం : డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించాలని టీడీపీ మండల అధ్యక్షుడు దొంతగాని శ్రీను ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో గ్రామాల్లో డ్రెయినేజీ సమస్యలను అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.


వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామపంచాయతీ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన అక్కినేపల్లి వీరాచారి –సంధ్యారాణి దంపతుల కుమారుడు సాయికుమార్ జన్మదినం సందర్భంగా వృద్ధులకు, మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, సంగిశెట్టి సుధాకర్, దాత కుటుంబ సభ్యులు, బంధువులు తడమమళ్ల శ్రీనివాసాచారి, రేకం నరేష్, రాందేని నరసింహారావు, దొంగరి నరసింహారావు పాల్గొన్నారు.

జన్వాడ బాధితులు కోలుకోవాలని ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కోదాడఅర్బన్ : రంగారెడ్డి జిల్లా జన్వాడ చర్చిలో జరిగిన దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్రైస్తవ భక్తులు త్వరగా కోలుకోవాలని ఆదివారం కోదాడలోని నయానగర బాప్టిస్ట్ చర్చిలో చర్చి పాస్టర్ వి.యేషయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ, ఏఎస్‌ఐకి సన్మానం



ఎస్‌ఐ సైదులును సన్మానిస్తున్న అంబేద్కర్ యూత్ సభ్యులు

గరిడేపల్లి : మండల నూతన ఎస్‌ఐ, ఏఎస్‌ఐలను పోనుగోడు గ్రామ అంబేద్కర్ యూత్ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సైదులు మాట్లాడుతూ.. యువత చదువుపై శ్రద్ధ ఉంచి బాధ్యతగా వ్యవహరించాలని, ప్రభుత్వ ఉద్యోగాలపై మక్కువ పెంచుకొని లక్ష్యాలను చేరుకోవాలని ఆయన యువతకు సూచించారు. కార్యక్రమంలో నందిపాటి శ్రీను, చిలక సైదులు, నందిపాటి శ్రీను, రామకృష్ణ, నరాల పవన్, రామ్ నాగేంద్రబాబు, పృథ్వీ, సన్నీ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో సిబ్బంది కొరత

- 17 గ్రామాలకు ఏడుగురే ఫీల్డ్ అసిస్టెంట్లు
- ఉపాధి పనులపై కొరవడిన పర్యవేక్షణ
- పనిభారంతో ఇబ్బందులు పడుతున్న పంచాయతీ కార్యదర్శులు
- నేటికీ నూతన గ్రామాలకు కేటాయించని ఎఫ్‌ఏలు



చిలుకూరులో పర్యవేక్షణ లేకుండానే ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

చిలుకూరు : గ్రామాల్లో వలసలను తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులోభాగంగా పనుల పర్యవేక్షణ ఇతరతర పనుల నిమిత్తం గ్రామానికో ఫీల్డ్ అసిస్టెంట్ నియమించింది. ఇందులో భాగంగా చిలుకూరు మండలంలో మొత్తం 17గ్రామపంచాయతీలకు గాను కేవలం 7గ్రామాలకు మాత్రమే ఫీల్డ్‌అసిస్టెంట్లను నియమించింది. ప్రధానంగా మండలంలో మేజర్ గ్రామాలైన చిలుకూరు, బేతవోలు, నారాయణపురం, కొండాపురం గ్రామాలకు ఫీల్డ్‌అసిస్టెంట్లను నియమించలేదు. దీంతో గ్రామాల్లో జరిగే ఉపాధిహామీ పనుల పర్యవేక్షణ, కూలీలకు సరైన పనిదినాలు కల్పించేందుకు ఇబ్బందులు పడాల్సివస్తుంది. ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడం ఆ భారం గ్రామ కార్యదర్శులపై పడడంతో వారు చాలా వత్తిడికి గురవుతున్నారు. జీపీ పనులు ఒక వైపు, ఉపాధిహామీ పనులు నిత్యం పర్యవేక్షణ చేయాలంటే మరో వైపు కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు.

సీనియర్ మేట్లలతో పనుల నిర్వహణ..

ఆయకట్టు మండలమైన చిలుకూరులో ఇప్పుడే ఇలా ఉంటే వరి కోతలు పూర్తియిన తరువాత ఎక్కువ పనిదినాలు జరిగే మార్చి, ఏప్రిల్, మే, జూన్, జులై నెలలో పనులు పర్యవేక్షణ, పనులు కల్పించడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశాలు లేకపోలేదు. ఆ నెలల్లో పనులు జరిగే చోట ఇబ్బందులు ఉంటాయని స్వయాన కార్యదర్శులు, సంబంధిత అధికారులే అంటున్నారు. ప్రస్తుతం సీనియర్ మేట్లలతోనే ఆ పనులను నెట్టుకొస్తున్నారు.

నూతన పంచాయతీల్లో నియామకాలు లేవు..

మండలంలో మొత్తం 17గ్రామపంచాయతీలు ఉండగా వాటిల్లో నూతనంగా దూదియాతండా, జానకీనగర్, రామ్‌చంద్రానగర్, మాధవగూడెం గ్రామాలు ఏర్పడ్డాయి. ఆ గ్రామాలు ఏర్పాటై 5ఏళ్ల పూరైనా నేటి వరకు ఎఫ్‌ఏలను నియమించలేదు. 17 గ్రామ పంచాయతీల్లో మండల కేంద్రం చిలుకూరు ఎఫ్‌ఏ సస్పెండ్ అయ్యింది. కొండాపురం, సీతారాంపురం గ్రామాలకు చెందిన ఎఫ్‌ఏలు అనారోగ్యంతో మృతి చెందారు. రామాపురం ఎఫ్‌ఏ రాజీనామా చేశారు. బేతవోలు, నారాయణపురం గ్రామాలకు ఎఫ్‌ఏలు ఉన్నప్పటికీ గ్రామంలో సరిపడా కూలీలకు పనిదినాలు చూపించలేదని తాత్కాలికంగా పక్కకు పెట్టారు. మండలంలో 10గ్రామాలకు ఎఫ్‌ఏలు లేకపోవడంతో పనుల కల్పన ఇబ్బందిగా మారుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి నూతన జీపీలకు, ఖాళీగా ఉన్న గ్రామాలకు ఎఫ్‌ఏలను నియమించి సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల కూలీలు కోరుతున్నారు.

సీనియర్ మేట్లను ఎఫ్‌ఏలుగా నియమించాలి



మా గ్రామంతో పాటు చాలా గ్రామాలకు ఫీల్డ్ అసిస్టెంట్లు లేరు. నా లాగా గ్రామాల్లో సీనియర్ మేట్లు ఉన్నారు. అర్హతల ఆధారంగా ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాల్లో సీనియర్ మేట్లను ఎఫ్‌ఏలుగా నియమించాలి. చాలా కాలం నుంచి ఉపాధి పని చేస్తున్నాము, తమను గుర్తించి న్యాయం చేయాలి.

– బాణోతు ప్రసాద్, కొమ్ముబండతండా, చిలుకూరు

కేవలం 7గ్రామాల్లోనే ఎఫ్‌ఏలు ఉన్నారు



మండలంలో 17గ్రామాలకు గాను కేవలం 7గ్రామాలకు మాత్రమే ఎఫ్‌ఏలు ఉన్నారు. 10గ్రామాల్లో వేర్వేరు కారణాలతో ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో సీనియర్ మేట్ల సహాయంతో పనులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే అనుగుణంగా ఖాళీలను భర్తీ చేస్తాం.

– నిర్మల, ఏపీఓ, చిలుకూరు

కొనసాగుతున్న సబ్‌జూనియర్ కబడ్డీ టోర్నమెంట్





కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర 33వ సబ్ జూనియర్ బాల, బాలికల కబడ్డీ టోర్నమెంట్ డే అండ్ నైట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఈ పోటీల్లో మొత్తం 68 బాల, బాలికల జట్లు పాల్గొనగా ఆదివారం లీగ్ మ్యాచ్ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మ్యాట్‌పై నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఇరుజట్ల క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. ఈ పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, క్రీడాఅభిమానులు తదితరులు పాల్గొన్నారు.

‘మైహోం’ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మైహోం యూనిట్ హెడ్ శ్రీనివాసరావు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో స్థానిక మైహోం సిమెంట్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజల నుంచి విశేషస్పందన లభించింది. వైద్యశిబిరాన్ని పరిశ్రమ ప్రెసిడెంట్, యూనిట్ హెడ్ ఎస్.శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఉచిత వైద్యశిబిరాలను ప్రతిఏటా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా చౌటపల్లిలో సుమారు 650మందికి గుండె, కిడ్నీ, బీపీ, షుగర్, చిన్నపిల్లలకు వచ్చే వ్యాధులు తదితర వైద్యపరీక్షలు నిర్వహించినట్లు, అదే విధంగా వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు అశోక్‌కుమార్, సౌజన్య, పార్థు, పిడియాట్రిక్ సాయికిరణ్, మాజీ ఎంపీపీ కె.లక్ష్మీవెంకటనారాయణ, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, ఎంపీటీసీ సైదమ్మ, మాజీ సర్పంచ్ కృష్ణవేణినరేష్, కాంగ్రెస్ అధ్యక్షుడు కొండేటి రామిరెడ్డి, మైహోం అడ్వైజర్ జగన్నాథరావు, ఏజీఎం శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మున్సిపల్ పాలక మండలి



హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన మున్సిపల్ పాలక మండలి సభ్యులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివారం రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నేరేడుచర్ల పాలకమండలి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి నేరేడుచర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేయడంతో పాటు నిధులను కూడా మంజూరు చేస్తానని అన్నారు. అదే విధంగా నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సహాయ, సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చినట్లు సభ్యులు వెల్లడించారు. మంత్రిని కలిసిన వారిలో మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్‌చైర్మన్ అలక సరిత సైదిరెడ్డి, కౌన్సిలర్లు కొణతం చిన వెంకట్‌రెడ్డి, రణపంగ నాగయ్య, లలితభారత్, బాషా, నాయకులు శ్రీనివాస్‌రావు, నారాయణ, రమాదేవి, రాంబాబు, సైబాల్ తదితరులున్నారు.

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

మున్సిపాలిటీలోని 9వవార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ భాణోతు లలితభరత్ ఆదివారం హైదరాబాద్‌లోని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కౌన్సిలర్‌కు మంత్రి పార్టీ కండువాను కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్మన్ అలక సరిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు రణపంగ నాగయ్య, ఎస్‌కె బాషా, నాయకులు కుంకు శ్రీనివాస్, వేమూరి నారాయణ, నక్క రమాదేవి, రాంబాబు, సైబాల్ తదితరులున్నారు.

వంతెన నిర్మాణానికి సర్వే



సర్వే చేస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెం పరిధిలోని కిందితండా నుంచి వరదాపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో పూడిగండి వాగుపై నూతన వంతెన నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులతో కలిసి స్థానిక మాజీ సర్పంచ్ భూక్యా నాగునాయక్ విలేకరులతో మాట్లాడారు. ఏళ్లుగా వంతెన కోసం ఎదురుచూస్తున్న పలు గ్రామాలు, తండాల ప్రజల కోరిక మేరకు మాజీ జెడ్పీటీసీ భూక్యా మంజీనాయక్ సహకారంతో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి సర్వేకు ఆదేశించారన్నారు. త్వరలోనే వంతెన నిర్మాణమవుతుందని, దీంతో ఈ ప్రాంత ప్రజల ఆశలు నెరవేరనున్నాయని అన్నారు. కార్యక్రమంలో సర్వే అధికారులు సురేష్‌నాయుడు, వివేక్, స్థానికులు వెంకటేష్‌నాయక్, మాంగునాయక్, శ్రీరామ్, గోపి తదితరులున్నారు.

పునఃప్రతిష్ఠలో భాగస్వాములు కావాలి



హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

కోదాడఅర్బన్ : పట్టణంలో గల శ్రీ కోదండ రామాలయంలో మూలమూర్తుల పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ నాగుబండి నళిని ఆధ్వర్యంలో ఆదివారం గడపగడపకు హనుమాన్‌చాలీసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామచంద్రస్వామి చిత్రపటాలను ట్రాక్టర్‌పై ఊరేగిస్తూ జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ మహిళలు కోలాటాలు, భజనలు, సంకీర్తనలతో ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. నయానగర్‌లో దేవరపల్లి మల్లేశ్వరీ సహకారంతో 108 గడపలకు హనుమాన్ చాలీసా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కె.చందర్‌రావు, ఈదుల కృష్ణయ్య, అన్నపూర్ణ, సౌమ్య, సుభద్ర, లక్ష్మి, సంధ్య, అనంతమ్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హరికృష్ణగౌడ్‌కు పెన్స్ ఆఫ్ హానర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న తండు హరికృష్ణగౌడ్

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన డాక్టర్ తండు హరికృష్ణగౌడ్ రచించిన ఎవాల్యూయేటింగ్ ఫ్యాక్టర్స్ ఎఫెక్టింగ్ యూజ్ ఆఫ్ మెడికల్ డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్స్ అనే పుస్తకానికి పెన్స్ ఆఫ్ హానర్ అవార్డు లభించినట్లు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డయాగ్నోస్టిక్స్‌కు సంబంధించిన ఎక్విప్‌మెంట్స్ వాటి పనితీరు, ల్యాబ్ మెషినరీ క్వాలిటీ కంట్రోల్స్ ద్వారా రక్తపరీక్షల్లో వచ్చే ఖచ్చితత్వం గురించి ఈ పుస్తకంలో క్లుప్తంగా వివరించినట్లు తెలిపారు. మెడికల్ విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ పుస్తక ఆవిష్కరణలో ప్రశాస్ పబ్లికేషన్ వారు ఈ అవార్డు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. అవార్డు ప్రధానోత్సవంలో పలువురు ప్రముఖ పబ్లిషర్స్, డాక్టర్స్, పలు యూనివర్సిటీల వైస్ చాన్సలర్స్, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి



హుజూర్‌నగర్ : మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కోదాడ : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న తుంగతుర్తిలో జరిగే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జిల్లా సమావేశాలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గింజల అప్పిరెడ్డి, శంకరమంచి రవీంద్ర శర్మ, జర్నలిస్టులపై దాడుల నిరోధక కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాదె రాము, కోదాటి విక్రమ్ రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ యూనియన్ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. ఈ సమావేశాలకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, జాతీయ కార్యవర్గ సభ్యుడు కొణిజేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని శ్రీనివాసరావు, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోలా నాగేశ్వరరావు, బంటు కృష్ణలు హాజరు కానున్నట్లు తెలిపారు.

హుజూర్‌నగర్ : ఈనెల 20న తుంగతుర్తిలో నిర్వహించే టీయూడబ్ల్యూజే యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోలా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల జర్నలిస్టులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జర్నలిస్టులు ఎన్.నరేందర్, శేషం రాజు, రామిరెడ్డి, శ్రీనివాసచారి, పి.శ్రీనివాసు, రామనాథం, జానీ, నాగుల్ మీరా, రామకృష్ణ, ఆర్‌పి గౌడ్, వెంకటరెడ్డి, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

శోభన్‌బాబుకు సన్మానం



సన్మానిస్తున్న బంధువులు, మిత్రులు

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన దళిత యువకుడు జిల్లేపల్లి శోభన్‌బాబు ఇటీవల ప్రకటించిన గురుకుల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించి ఎంపిక కావడంతో ఆదివారం గ్రామంలో బంధుమిత్రులు, గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శోభన్‌బాబు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ కష్టపడి కాకుండా ఇష్టపడి క్రమశిక్షణతో చదివి ఉన్నత ఉద్యోగం సాధించి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు చదివిన పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మిత్రులు సొంపంగు గోపి, జిల్లేపల్లి శ్రీనివాస్, జిల్లేపల్లి సుమన్, రవి, మచ్చ పాండు, సైదాబాబు, వెంకటేశ్వర్లు, గురుస్వామి, మచ్చ వెంకటేష్, కుటుంబసభ్యులు, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యపై విచారణ జరిపించాలి

నేరేడుచర్ల : సూర్యాపేట జిల్లా ఇమాంపేట ఎస్సీ గురుకుల పాఠశాలలో ఒకే నెలలో జరిగిన విద్యార్థినుల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోమ్రరాజు వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినుల వరుస ఆత్మహత్యలపై జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి ఒక కమిటీ వేసి ఆ కమిటీ ద్వారా సమగ్ర విచారణ జరిపించాలన్నారు. విద్యార్థినుల ఆత్మహత్యలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థినుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తులో చిక్కుకోకుండా పోలీస్ శాఖ అప్రమత్తం కావాలన్నారు.

‘చలో హైదరాబాద్’కు తరలిరావాలి

నేరేడుచర్ల : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న జరిగే చలో హైదరాబాద్ సెక్రటరేట్ కార్యక్రమానికి అర్చకులు భారీగా తరలిరావాలని దూప, దీప, నైవేద్య అర్చకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంభోట్ల ఫణికుమారశర్మ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో 6500మంది దూప, దీప, నైవేద్య అర్చకులు గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్నారని, చాలీచాలని గౌరవ వేతనాలతో అర్చకులు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రతి నెలా ఇచ్చే గౌరవ వేతనం కూడా నెలనెల రాకపోవడంతో కుటుంబ భారంగా మారిందన్నారు.

ఘనంగా బొడ్రాయి, ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

మఠంపల్లి : మండలంలోని బోడబండతండాలో గిరిజనులు బొడ్రాయి, ముత్యాలమ్మ ఆలయ మూడో వార్షికోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు బొడ్రాయికి, ముత్యాలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించి కోళ్లు, మేకలను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బానోతు బాబునాయక్, ట్రాన్స్‌కో డీఈఈ సక్రునాయక్, గ్రామపెద్దలు మంగళానాయక్, పుల్‌సింగ్ నాయక్, కిషన్‌నాయక్, బోడకా, హుస్సేన్, పత్యానాయక్, గణేష్, పవన్, అనిల్, నితిన్, కాలూనాయక్, బాబునాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

అనంతగిరి : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తగోల్‌తండా, పాతగోల్‌తండా, మీట్యాతండా, కొత్తగూడెం, చనుపల్లి, కిష్టపురం, పాలారంతండా గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులకు వారు శంకుస్థాపన చేసి మాట్లాడారు. మండలంలో ఉపాధిహామీ నిధులు రూ.2.80కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని అందులో భాగంగానే ప్రతి గ్రామంలో సీసీరోడ్లు డ్రెయినేజీల నిర్మాణం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోతు బాబునాయక్, బుర్ర పుల్లారెడ్డి, ముత్తినేని కోటేశ్వరావు, వేణు, జ్ఞానేందర్‌రెడ్డి, ముసుగు మధుసూదన్‌రెడ్డి, కత్రం నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడి జన్మదినం

హుజూర్‌నగర్ : పట్టణంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లకొండ గురవయ్య, జిల్లా, మండల నాయకులు చింతకాయల రాము, సలిగంటి జానయ్య, సప్పిడి సావిత్రి, కందుల వెంకటేశ్వర్లు, గడ్డం వెంకటమ్మ, లలిత, నాగరాజు, వీరయ్య, ప్రసాద్, సీతారాములు, శ్రీను, కోటేశ్వరరావు, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- బరాఖత్‌గూడెంలో నేటి నుంచి వారం రోజుల పాటు శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- వేడుకల్లో భాగంగా క్రికెట్, కోలాట, కబడ్డీ, డ్యాన్స్ పోటీల నిర్వహణ



బరాఖత్‌గూడెంలో బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో నేటి నుంచి వారం రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 450ఏళ్ల క్రితం స్వయంభూగా వెలసిన ఈ దేవాలయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తర ద్వార ముఖం కల్గిన ఏకైన దేవాలయంగా పేరొందింది. ఈ ప్రాంత ప్రజల ఆరాధ్యదైవమైన శ్రీవేంకటేశ్వర స్వామి నిత్య పూజలు అందుకుంటాడు. కాగ ప్రతియేటా మాఘశుద్ధ దశమి నుంచి బహుళపాడ్యమి వరకు కొనసాగే ఈ ఉత్సవాల్లో భాగంగా పౌర్ణమి రోజున స్వామి వారి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు..

వారం రోజుల పాటు కొనసాగే బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి నుంచి తొళక్కంతో ప్రారంభం కానున్నాయి. 20న అధ్యయనోత్సవం, 21న పరమపదోత్సవం, 22 ఉదయం సూత్తందాధిచాత్మర, రాత్రి అకురార్పణం, 23 ఉదయం హోమ ప్రారంభం, ధ్వజారోహణం, 24 ఉదయం స్వామివారి అభిషకం, కోనేరులో వరహాస్వామివారి దివ్య దర్శనం, రాత్రి 12గంటలకు స్వామి వారి కల్యాణం 24మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ ఉత్సవాలకు దేవాలయ పాలకమండలి, దేవాదాయ శాఖ కార్య నిర్వాహణాధికారితో పాటు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది.

రాష్ట్రస్థాయి పోటీలు..

బరఖత్‌గూడెంలోని స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో వారం రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ గ్రామానికి చెందిన యువత ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రికెట్, కబడ్డీ, కోలాటం పోటీలతో పాటు స్లోబైక్ రేసింగ్, ముగ్గుల పోటీలు, డ్యాన్స్‌బేబి డ్యాన్స్‌బేబి పోటీలను నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, కృష్ణా జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు హాజరు కానున్నారు. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంలో వారం రోజుల పాటు పండుగ వాతావరణం నెలకొననుంది.

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం



నేటి నుంచి వారం రోజుల పాటు స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా కొనసాగే స్వామి వారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేశాం. ఈ బ్రహ్మోత్సవాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలి.

– పోలిశెట్టి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ నిర్వాహకుడు, బరాఖత్‌గూడెం